


# షర్ఫుద్దీన్

ఒకమ్మకు ఒక్కడే కొడుకు. ఆ అమ్మకు ఆ కొడుకు తప్ప యింకెవరూ లేరు. ఆ కొడుక్కి కూడా ఆ అమ్మ తప్ప యింకెవ్వరూ తెలియదు. అతని పేరు షర్ఫుద్దీన్. షర్ఫుద్దీన్‌కు చిన్నప్పుడే దైవం మీద మక్కువ కలిగింది. జీవితాన్ని దైవానికే అంకితం చేయాలని అనుకున్నాక తల్లి దగ్గరకు వెళ్లి - 'అమ్మా. నేను దైవమార్గాన్ని కనుగొనడానికీ, కనుగొని అనుసరించడానికీ, గురుస్థానం పొంది ఆ మార్గాన్ని నలుగురికీ చూపించడానికి వెళుతున్నాను. నేను దీనిని సాధించాక తిరిగి వస్తాను. నన్ను ఆశీర్వదించు' అన్నాడు.

అయ్యో నాకున్నది ఒక్కగానొక్క బిడ్డ కదా వీడు వెళితే నా మంచిచెడ్డలు ఎవరు చూసుకుంటారు అని ఆ తల్లి అనుకోకుండా 'అలాగే నాయనా. వెళ్లిరా' అంది.

షర్ఫుద్దీన్ దైవమార్గం కనుగొనడానికి వెళ్లాడు. ఎన్నో ఏళ్లు ఎక్కడెక్కడో తిరిగాడు. ఎందరో గురువులకు సేవలు చేశాడు. గడ్డాలు మీసాలు పెరిగాయి. వెంట్రుకలు తెల్లబడ్డాయి. ముసలివాడు అయిపోతున్నాడు. అయినప్పటికీ ఆయనకు అసలు దైవమార్గం అంటే ఏమిటో తెలుసుకోవడమే సరిపోతోంది గానీ గురుస్థానం దక్కడం లేదు.

యిదంతా చూసీచూసీ మనసు కష్టపెట్టుకున్న షర్ఫుద్దీన్ ఒకసారి గురువుగారితో 'హజ్రత్. నేను చేసిన పాపమేమి? ఎన్నో ఏళ్లుగా మీకు సేవలు చేశాను. మీ బోధనలు విన్నాను. పవిత్ర గ్రంథాలను పారాయణం చేశాను. దైవస్మరణ తప్ప మరో పని నేను ఎరగను. అయినా గానీ నాకు గురుస్థానం దక్కడం లేదు. నిజమైన దైవమార్గం తెలిసినవాడిగా నన్ను ఎవరూ పరిగణించడం లేదు. ఇందుకు చాలా బాధగా వుంది' అన్నాడు.

గురువు అంతా విని 'నాయనా. అమ్మ ఇంటి దగ్గరే వుంది' అన్నారు. అంతే. అంతకు మించి ఏమీ మాట్లాడలేదు.

ఎప్పుడైతే ఆయన ఆ మాట అన్నాడో షర్ఫుద్దీన్‌కు ఒక్కసారిగా తల్లి గుర్తుకొచ్చింది. దైవమార్గం కనుగొని తిరిగి వస్తాను అని తను చెప్పిన మాట గుర్తుకొచ్చింది. ఆమె నాకోసం ఎదురు చూస్తూ వుంటుంది గదా అనే తలంపు కలిగేసరికి ఎక్కడలేని దుఃఖం పొంగుకొచ్చి తల్లి దగ్గరకు ఆఘమేఘాల మీద బయలుదేరాడు.

అతను వచ్చేసరికి తల్లి మంచాన పడి వుంది. బిడ్డ కడగొట్టు చూపుల కోసం ప్రాణాలు ఉగ్గబట్టుకొని ఉంది. చూసే ఆలనాపాలనా లేదు. తల్లి అవస్థ చూసి 'అమ్మా అమ్మా' అని అలమటించిపోయాడు షర్ఫుద్దీన్. మూడు రోజులపాటు ఆమెకు సేవలు చేశాడు. మలమూత్రాలు ఎత్తిపారేశాడు. ఆమె మాసిన బట్టలు ఉతికేశాడు. తిండితిప్పలు స్వయంగా వండిపెట్టాడు.

మూడోరోజున ఆమె 'నాయనా మంచినీళ్లు' అంది. వెంటనే షర్ఫుద్దీన్ వెళ్లి మంచినీళ్లు తెచ్చేసరికి ఆమె నిద్రపోయింది. 'అయ్యో. మా అమ్మ నీళ్లు అడిగి నిద్రపోయిందే. ఏ అపరాత్రో లేచి దాహానికి యిబ్బంది పడదు కదా' అనుకొని, నీళ్లు పట్టుకొని ఆమె తల దగ్గరే నిలుచున్నాడు.

తెలతెల్లగా తెల్లవారుతుండగా ఆమె కళ్లు తెరిచింది. ఎదురుగా కొడుకు నిలబడి వున్నాడు. ఆమెను చూసి 'అమ్మా నీళ్లు' అన్నాడు.

ఆమె తృప్తిగా ఆ నీళ్లు తాగి ఎంతో సంతోషంగా 'నాయనా. యివాళ నేను నిన్ను మనస్ఫూర్తిగా మన్నించాను. నిజమైన దైవమార్గాన్ని యివాళ నువ్వు కనుగొన్నావు' అని చెప్పి కన్ను మూసింది.

షర్ఫుద్దీన్ ఎక్కడెక్కడో తిరిగి ఎందరెందరికో సేవలు చేసి గురుస్థానం పొందాలని చూశాడు. కానీ అది ఆయనకు దక్కలేదు. మూడు రోజులపాటు తల్లికి సేవ చేయగానే ఆయనకు ఆ స్థానం దక్కింది. ఆ తర్వాత ఆయన గురువుగా ఎందరికో నిజమైన దైవమార్గం చూపించాడు.